

గుఱ్ఱబ్బండి గూడు లోపల బాగా దళసరిగా ఉన్న అందమైన రంగుల అద్దంపల్లి దుప్పటి కుదుమట్టంగా కుట్టేసి ఉంది. కింద మెత్తటిగడ్డీ దాని మీద బూరుగుదూది పరుపూ ఆ పరుపు మీద చింతపిక్కరంగు ముఖమల్‌దుప్పటి పరిచి అంచులు బిగ్గా బిగించేసి అట్టడుక్కి తోసేసి ఉన్నాయి. పరుపు మీద కూర్చుని కాళ్ళు బయట పెట్టుకోడానికి తాటగా ఉన్న ఇనపరేకు బిగించి ఉంది. చక్రాల బొడిపెలకి ఇత్తడి తొడుగులు రివిటింగ్ చేస్తున్నాయి. పొద్దోతే చీకట్లో బాట చూపించడానికి రెండు ఇత్తడిగొట్టం దీపాలు గూడుకి ఎడాపెడా ముందూ వెనకా బిగించి ఆ దీపాల్లో పెట్రోలు పోసేరు.



మున్సబుగారి దొడ్లో ఉన్న మూడు పాడె గేదెల పక్కనా నిలబడి ఆబగా దాణా తింటున్న ఆ గుఱ్ఱాన్ని కాశీనించి కొనుక్కొచ్చారు. తోక తెల్లగా ఉన్న దాని నాలుగు కాళ్ళ గుత్తుల మీదా మూతి మీదా తెల్ల మచ్చలున్న ఆ బలమైన పంచకళ్యాణికి క్రిష్ణమూర్తి అని పేరు పెట్టేరు. దాని జూలు నిమురుతా తీసుకొచ్చిన రౌతు ఏసురాజు కళ్ళకి గంతలూ జీను బిగించి క్రిష్ణమూర్తిని బండికి కట్టిన కాసేపటికి యమాదర్జాతో లోపల్నుంచి దిగేడు మున్సబుగారు.

బాగా ఎత్తుగా పుష్టిగా ఉండే మున్సబుగారి వయసు ఏభైలోపుంటది. లూజుగా కుట్టించుకున్న తెల్లటి బిన్నీ పరాయీ, ముతగ్గా బంగారం రంగులో ఉండే పొందూరు సిలుకు ఖద్దరు చొక్కాయి, దానికి బంగారం గొలుసుతో లింకేసిన బొత్తాలు ఆదిగాడు కుట్టిచ్చిన కిర్రు చెప్పుల్తో బండి ఎక్కుతున్న మున్సబుగార్ని చూడ్డానికి రెండుకళ్ళు చాలవు.

''గవళ్ళపేటలో కెళ్ళరా ఏసురాజా!'' బండెక్కేక అన్నాడు మున్సబుగారు.

ఒక్క ఎగురు ఎగిరి దండీ మీద కూర్చున్న ఏసురాజు చర్నాకోలా ఝుళిపించేసరికి పరుగులంకించుకున్నాడు క్రిష్ణమూర్తి.

పెద్దవీధిలో ఉండేవాళ్ళ వాడపిల్లి పెంకుటిల్లు దాటుకుంటా వెలగలోరి వీధీ, గరికిపాటి చిట్టిగారింటి ఫోస్టాఫీసూ అరుగూ, పెరుగునుయ్యా, రత్తమ్మగారి కిరణాకొట్టూ దాటుకుని కొత్తసంతపేటలోకి అడుగెట్టేక ఎడం పక్క సందులోంచెళ్ళి బడుగోళ్ళ కటకటాలింటి దగ్గరాగింది గుఱ్ఱబ్బండి.

ఆ ఇంటిముందు దెబ్బలాడుకుంటున్న జనాల్ని ''ఎదవతత్తుకొడకల్లారా'' అని తిట్టి, మెత్తగా దొబ్బులెట్టి అందులో ఒకడికొత్తెం మీద ఒకటేసి అయిదంటే అయిదు సెకెండ్లలో అంతా సద్దుమణిగేలా జేసి బండెక్కుతా వాళ్ళలో పెద్దోడ్ని దగ్గరకి పిల్చి ''ఆళ్ళు రెండురోజులు కొట్టుకు సచ్చేక ఇంకేం గొడవలూ అవ్వవురా బోసూ'' అన్నాడు.

''ఆయ్...నేనూ అదే అనుకుంటున్నానండి'' అన్నాడు గవళ్ళబోసు.

''మరి ముహూర్తాలు పెట్టించెయ్... పెళ్ళికి పిలుస్తావా మర్చిపోతావా?''

''అయ్యబాబోయ్ ఎంత మాటన్నారండి...బాబియ్యా'' అన్నాడు బోసు.

నవ్వేస్తా ఏసురాజు కేసి తిరిగిన మున్సబు ''శివలవెళ్ళరా'' అన్నాడు.

''రాంపురం రోడ్డమ్మట పోనిమ్మంటారా... ముచ్చుమిల్లి కాలవ గట్టుమీంచి పోనిమ్మంటారా?''

''శీతాకాలం గదా..కాలవగట్టు మీంచెళదాం ఈవేళ'' అన్నారు మున్సబుగారు.

లాకులు దాటుకుంటా ముచ్చుమిల్లి కాలవగట్టు ఎక్కిన గుర్రబ్బండి పెద్ద పెద్ద ముసలి చింతచెట్ల నీడల్ని దాటుకుంటా ముందుకెళ్తుంది. కాలవగట్టుకి ఎడం పక్కనున్న బోదిగట్టు మీదున్న బొబ్బాసి చెట్టు మీది కాయని పండినంతమేరకి బొర్రుపెట్టి తింటుంది మాలకాకి. పేరు తెలీని పిచ్చి తీగ పచ్చటి ఆకుల్ని మొండి తాడిచెట్టు మొదల్నుంచి పైదాకా అల్లుకు పోతుంది. దానికి ఎడంగా ఉన్న పాకలో తూరుపు నించొచ్చిన కూలోళ్ళు మకాం ఉన్నట్టున్నారు. వాళ్ళలో ఒకడికి తేలుకుట్టిందంట. కుట్టిన చోట చింతపిక్క అరగదీసి అంటిస్తున్నాడు ఇంకొకడు. వాడి పక్కనే కల్లు ఫూటుగా తాగేసిన మావగారు పిల్లలు పుట్టకండా ఆపరేషను చేయించుకొమ్మని అల్లుడ్ని కొడ్తున్నాడు.

అది జూసి నవ్వుకుంటున్న మున్సబుగారు గేలాపెత్తుతున్న గుర్రంకేసి ప్రేమగా జూస్తా ''క్రిష్ణమూర్తి ఇవ్వేళ బానే తిన్నాడా?'' అన్నాడు.

''ఆయ్...మాయిడు ఉలవలు ఉడకేసి వేసేనండి సిమ్మెంటుగోలుంలో''అన్నాడు ఏసురాజు.

కాలవ గట్టు మీంచి రామచంద్రపురం శివార్లో ఉన్న చప్పిడోరిసావరం దాటుకుంటా పోలీసు క్వార్టర్సు దాటి తోటోరివీధి మీంచి వెల్ల వంతెనెక్కుతుంది బండి.

ద్రాక్షారామం, అటుకుల మండపం, వేగాయమ్మపేటా దాటుకుంటా ఎర్రపోతవరం వంతెన దిగి శివలలో చెరువుగట్టున స్కూలు బిల్డింగ్ అవతలున్న కమ్మోరి పెళ్ళి పందిట్లో మున్సబుగారి జట్కాబండి ఆగి ఆగ్గానే అంతా వచ్చి రాజమర్యాదల్తో తీసుకెళ్ళిపోయేరు లోపలికి.

భోజనాలూ బొట్లూ కడాకర్లో సాగనంపడాలు అయ్యేసరికి శీతాకాలం సూర్యుడు నడినెత్తికొచ్చేడు.

తిరిగి పసలపూడి వూళ్ళోకి దిగితుంటే రిక్షా తొక్కే రామ్మూర్తి ఎదురొచ్చి ఆపితే ''ఏంట్రా ఏవయింది?'' అన్నాడు మున్సబుగారు.

''ఆడి పొడ ఈడికి గిట్టటం లేదండి అసలు గొడవంతా ఆళ్ళ దొడ్లో కరివేపాకు రొబ్బ ఇరుసుకున్నందుకొచ్చిందండి దాంతో ఆడు కోపం ఉగ్గబట్టలేకపోయేడండి'' అన్నాడు రిక్షా రామ్మూర్తి.

''ఆడికి చాలా గీర్మాణం లాగుందే'' అన్నాడు మున్సబుగారు.

''గీర్మాణం కాదు గానండీ... కొంచెం ఓర్పుం తక్కువండి'' అన్నాడు.

ఆడితో కాస్సేపు మటాడేకా ''ఎల్లుండు దీపాలేళప్పుడు రానా మీ పేటలోకి?''అనేసి బయల్దేరేడు మున్సబుగారు.

ఇంట్లో దిగిన మున్సబుగారు ప్రతిరోజులాగే రెండుగంటల సేపు మధ్యాన్నం నిద్రజేసి మళ్ళీ నాలుగయ్యేసరికి లేచి కందికంపతో కాచిన ఉడుకు నీళ్ళతో స్నానం చేసి పొద్దుట బట్టలు గాకుండా మళ్ళీ ఇస్త్రీ బట్టలేసుకుని బండెక్కి మళ్ళీ కాలవగట్టు దగ్గర కొచ్చేసరికి తను

చెయ్యబోయే సందడికోసం ఎదురు చూస్తున్న ఊళ్ళో దండంతా చుట్టూ మూగింది.

ఆమాటా ఈ మాటా అయ్యేకా ''వచ్చే ఏడాది గణపతి నవరాత్రి పందిట్లో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చింతామణి నాటకం పెట్టిద్దాం'' అన్నాడు ఏడాకుల వెంకట్రావు.

''ఆ పని చింతా అప్పారెడ్డిగారు చేస్తున్నారు గదా ప్రతి ఏడూ?'' అన్నాడు మున్సబుగారు.

''పాపం ఆ మనిషి ఒక్కరే అయిపోలేదూ'' చింతా వెంకట క్రిష్ణారెడ్డి.

''సరే అయితే... శాస్త్రిగారి ప్రోగ్రామ్ములే పెట్టిద్దాం'' అన్న మున్సబుగారు అలాగ ఒక గంటసేపు ఆ జనాబాతో చాలా సందడి చేసేకా ''కాస్సేపు రాంపురం వెళ్ళొచ్చేస్తానోరే'' అనేసి జట్కా ఎక్కేడు.

''రాంపురం రోడ్డమ్మట పోనిమ్మంటారా..ముచ్చుమిల్లి కాలవగట్టు మీంచి పోనిమ్మంటారా?'' పాత పాటే పాడేడు ఏసురాజు.

''చలి తిరిగింది గదరా... రోడ్డమ్మటే పోనియ్యి... రద్దీ పెరిగింది గందా కొంచెం పక్క సైడునించి పోనియ్యరా'' అన్నాడు.

రామచంద్రపురంలో రాజుగారి హాలు ముందు బండాపి దిగిన వెంటనే తనకోసం చూస్తున్న మిత్రులంతా సిల్లోబుల్లో మంటా మూగిపోయేరు. వాళ్ళందరితో చాలాసేపు అదీ ఇదీ మాటాడ్తుంటే అటు పక్క చలిగాలి తిరిగింది, చీకటి చిక్కబడింది. సినేమా తొలి ఆట వదిలేరు. బండికున్న దీపాలు వెలిగించిన ఏసురాజు, మున్సబుగారు ఎక్కేకా గాలిలో గమ్మత్తయిన కొరడాచప్పుడు చేసేసరికి గేలాపెత్తడం మొదలెట్టేడు క్రిష్ణమూర్తి.

* * *

సంక్రాంతి నెలపట్టి వారమయ్యింది. మంచు దోమతెరలాగ మురమండ భోగమోళ్ళ ఇంట్లో లేసుతెరలాగ కప్పేస్తుంది వూర్ని. అప్పుడే లేచిపోయిన మున్సబుగారి తల్లి ఆదియమ్మ నూతిలో చేద వేసింది. పెద్దమ్మాయి బులిపాప లాంతరు చూపిస్తా గళ్ళ దుప్పటి కప్పుకుని చీడీ మీద కూర్చుంటే ఇంటి ముందు పాచి చేసి రథం ముగ్గు పెట్టడానికి చుక్కవేస్తుంది మున్సబు భార్య సూర్యావతి. మంత్రాలమూర్తిగారు పుంతరేవుస్నానానికి బయల్దేరిపోయేరు. రాజేశ్వరస్వామి గుడి గోపురంలో గబ్బిలాలు ఎగురుకుంటా ఆకాశంలో కెగిరిపోతున్నాయి.

వాళ్ళ పేటలోంచి ఎప్పుడో వచ్చి అంతా రడీ చేసేసిన రౌతుఏసురాజు క్రిష్ణమూర్తికి తగిలించిన గుర్రబ్బండితో పాటు రడీగా ఉన్నాడు మల్లెపువ్వులాగ తయారైపోయిన మున్సబుగారు ఎన్నో జన్మల కిందట ఏదో దేశానికి మారాజులాగ అంగలేసుకుంటా చీకట్లో చంద్రుళ్ళాగ వచ్చేసి పెద్ద కుదుపుతో బండిలో కూర్చున్నారు. ఆ కుదుపు కెప్పుడ్నుంచో అలవాటు పడున్న క్రిష్ణమూర్తి పెద్దగా సకిలించేడు.

'వెదురుపాక సావరం వెళ్ళరా'' అన్నాడు మున్సబుగారు.

''అలాగ సోమేశ్వరం మీంచెళ్ళినా...ఇలాగ మనూరి కాష్టాలదిబ్బ దాటేసి సర్వాయతోట మీంచెళ్ళనా?'' అడిగేడు ఏసురాజు.

''ఎలాగెళ్ళినా... కుదుపులేకుండా ఎళ్ళు'' అని మున్సబుగారు అనేసరికి గమ్మత్తయిన చప్పుడొచ్చేలాగ కొరడా ఝుళిపించేడు ఏసురాజు. పరుగులంకించుకున్నాడు క్రిష్ణమూర్తి.

చల్దిపొద్దేళ దాటింది. లొల్లా, రాయవరందాటి కుడిపక్క కంకరబాటలోకి మళ్ళిన మున్సబుగారి గుర్రబ్బండి కొంతసేపు ముందుకెళ్ళి ఎడం పక్క పొలాల మధ్యలో కొచ్చింది.

పడాల సుబ్బన్నగారబ్బాయి వెంకన్న కాలం చేసేడు. ఆవేళ పెద్ద దినం.

వాళ్ళింటి ముందు దిగిన మున్సబు "పిల్ల దినానికి రాలేదని ఏవనుకోవద్దు బాయ్యా...ఏం ఇదవ్వద్దు మాయ్యా" అని అందరితో నందివర్ధనం పువ్వులాగ నవ్వుతా మాటాడ్తుంటే చల్లటి ఇగణంలాగ అయిపోయిన ఆ వెదురుపాక సావరం జనం కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళ చెంబు ఇచ్చేరు.

మంగయ్యగారి గాదుల సావిట్లో భోజనాలూ అయ్యేక అందర్నీ పలకరించి మళ్ళీ వస్తానని చెప్పడాలు అయ్యేసరికి శీతాకాలం సూర్యుడు పడమటికి తిరగడం మొదలెట్టేడు.

కొత్త బెల్లంముక్క బుగ్గనెట్టుకున్నట్టు తియతియ్యగా అక్కడున్న అందరితో అదీ ఇదీ చెప్పి గుఱ్ఱబ్బండి ఎక్కిన మున్సబుగారు రాయవరం ఊళ్ళోకెళ్ళి అక్కడ్నుంచి మహేంద్రాడ (మహేంద్రవాడ) వెళ్ళేసరికి చీకటి చిక్కబడ్డం మొదలెట్టింది. చలిగాలి మొదలయ్యింది. దూరంగా కోసేసిన చెరుకు తోటలో తుక్కు తగలెడ్తున్నారు పెద్దమంట. ఆ వేడి గాలిలో కల్సి ఈ పక్కకొస్తుంది.

మహేంద్రాడలో చిన్నం వెంకట నర్సయ్యగారమ్మాయి బులిసావిత్రి శోభనం ఆవేళ.

జట్కా దిగిన మున్సబుగారికి ఒకటే గౌరవం.

ఆ వేళ రాత్రి తాటిచిగురులూ, ఈత చిగురులూ రకరకాల మందులు. రకరకాల నీచువంటలు. పెళ్ళికన్నా, చావుకన్నా మహాగొప్పగా ఉందక్కడ. ఎక్కడ చూసినా సంబరం...కొమరిపాలెం తారాజువ్వలు వదుల్తున్నారు కుఱ్ఱోళ్ళు లోపలికి తీసుకెళ్ళిపోయిన మున్సబుగార్ని మట్టుకి మాగొప్పగా మర్యాద చేస్తున్నారు.

* * *

ఇంతా జేస్తే మున్సబుగారు మా పసలపూడికి మున్సబుకాదు. పసలపూడికే గాదు ఏ వూరికీ మున్సబుకాదు. వెనకటికెప్పుడో మున్సబు పరీక్షలు రాసేడంట. అది జూసిన ఎవరో మున్సబుగారూ అని పిలవడం మొదలెట్టేరు. ఈ రోజుల్లో కొచ్చేటప్పటికి అసలు పేరు మర్చిపోయి అందరి నోళ్ళమ్మటా అదే పిలుపు.

మున్సబుకున్న పొలం నాలుగే నాలుగు ఎకరాలు. అది తమ్ముడు మారెడ్డి పండించి ఇస్తాడు. మూడు పాడిగేదెలున్నాయి. తల్లి ఆదియమ్మ ఆపాడి పిడకలూ అమ్మి ఇస్తది.

ఆ ఆదాయంతో జాయ్ జాయ్ మంటా ఖర్చు పెడతా ఎక్కడా బేడకాసు అప్పు జెయ్యకండా అవినీతికి పోకండా మారాజు దర్జాతో బతుకుతున్నాడు. ఊళ్ళో వందల ఎకరాల రైతులకంటే చాలా గొప్పగా ఆ రైతులంతా ఇంత డబ్బుండి ఆ మున్సబులా బతకలేకపోతన్నావేంటి అనుకునేలాగ బతుకుతున్నాడు. దేవుడు గంభీరమ్మైన ఎత్తయిన రూపం నాలుగు నలుగుర్ని శాసించగలిగే కంచుకంఠం నలుగురి మీద పెత్తనం చెలాయించగలిగే లౌక్యం ఇచ్చాడేమో వాటితో నలుగుర్ని శాసిస్తా, సాయాలు జేస్తా వెలుగుతున్నాడు.

లాకుల్లోపల పైరు దగ్గర కూర్చున్న గంటాగళాసూ, లస్కరూ, సూపర్నెంటూ ''ఇంత తక్కువ ఆస్తితో అంత రాజదర్జాతో బతకడం ఎలా కుదురుతుందట మున్సబుగారికి?'' అనుకుంటా లెక్కలేయడం మొదలెట్టేరు.

ఎకరాలకి ఒక పంటకి 60 బస్తాలు. కుటుంబానికి కావల్సిన కూరగాయలు పొలంలోనే పండించుకుంటారు. సంత ఖర్చులు లేవు. బట్టలుతికేవాళ్ళకీ కత్తిరింపు తీసేవాళ్ళకీ 10 కుంచాలనించి 20 కుంచాల దాకా ఖర్చు. ఆ ఖర్చులు పోతే పంటంతా మున్సబుదే. సాదరు ఖర్చులకి మున్సబు తల్లి ఆదియమ్మ పాలు పెరుగు పిడకలు అమ్మి ఇచ్చే డబ్బులు ఈ ఆదాయంతో ఎవడికీ పావలా కాసు బాకీ లేకుండా పావలాకాసు వెనకెయ్యకుండా బాకీ లేకుండా పావలాకాసు వెనకెయ్యకండా వచ్చింది వచ్చినట్టు హాయిగా ఖర్చు పెట్టేసుకుంటున్నాడు

మున్సబుగారు.

అతని ముగ్గురు కూతుళ్ళూ అతన్లాగే అందంగా ఉంటారు.

కొప్పవరం నించొకళ్ళు, రాయవరం నించొకళ్ళు, కుతుకులూరు నించొకళ్ళు వచ్చి పైసా కట్నం అడక్కుండా సంబంధాలు చేసుకున్నారు.

''అదేంటని'' ఎవరన్నా అంటే ''మున్సబుగారి సంబంధం అందుకోడమే గొప్ప మళ్ళీ కట్న మడగడవేంటి?'' అని ఎదురడిగేరు.

* * *

ఊళ్ళో గాలి మేడల్లో కోట్లకి కోట్లు నల్ల డబ్బున్న వాళ్ళ ఇళ్ళల్లో ఇన్‌కంటాక్స్ రైడు జరుగుతుంటే అంతా లోపల బూజుపట్టిన నోట్ల కట్టలు దొడ్లో గడ్డిమేట్లు వెనకాలా అదీ దాచేస్తున్నారు. నగల సంచులు కుళ్ళికాలవ తూముల్లోకి, పెంటకుప్పల్లోకీ తోసేస్తున్నారు. పొలం దస్తావేజులూ తాటాకుపాక చూరుల్లోనూ, లేబరికి అప్పులిచ్చి వాళ్లచేత రాయించుకున్న ప్రామిశరీనోట్లు దూళ్ళ దొడ్లో గోతులు తవ్వి వాటిలో దాచేయడం లాంటివి చేస్తే నోటమ్మట మాట పైకి రాకుండా జాగ్రత్త పడ్తున్నారు.

డబ్బు ఎక్కడదాయాలో ఏంటో అన్న బాదరబందీ లేని మున్సబుగారు ఊరి పెద్ద వీధిలో బండిలోపల హాయిగా వెల్లకిలా పడుకుని ''జాయ్‌గా అనపర్తి పక్కనున్న లక్ష్మీ నరసాపురం వెళ్ళమని మన క్రిష్ణమూర్తికి జెప్పరా ఏసురాజూ!'' అన్నాడు.

* * *